క్లుప్తంగా

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై కూటమి దుష్ప్రచారం

గరుగుబిల్లి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ కూటమి నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు విమర్శించారు. ఇదే విషయమై విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆయన.. చట్టం ఇంకా అమలులోకి రాకముందే ప్రభుత్వం చట్టం అమలు చేసేస్తోందని, మీ భూములన్నీ లాక్కుంటారని టీడీపీ, జనసేన పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం చేయడం ఏమాత్రం తగదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వంపై విషప్రచారం మొదలుపెట్టాయని, అయితే వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేంద్రం అమలుచేయాలని చూస్తున్న ఈ చట్టం రాష్ట్రంలో ఇంకా అమలుకాలేదని, పరిశీలన దశలోనే ఉందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న సీఐ మంగరాజు

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని చినమేరంగి సీఐ మంగరాజు కోరారు. మండల కేంద్రంలోని ప్రజలతో సోమవారం రాత్రి సమావేశమైన ఆయన.. ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో అందరూ పాల్గొనాలని, ప్రతిఒక్కరూ నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అనవసరమైన తగాదాలకు పాల్పడినా, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి, డబ్బు, మద్యం తరలించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అమ్మనరావు తదితరులు పాల్గొన్నారు.

346 బ్యాలెట్ ఓట్లు పోలింగ్



ఓటు కోసం క్యూలో ఉన్న ఉద్యోగులు

పాలకొండ: నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మంగళవారం నాడు 346 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2462 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు మొత్తం 1656 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం కూడా పోలింగ్ కొనసాగుతుందని ఎన్నికల సహాయాధికారి వరహాలు తెలిపారు.

91 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నమోదు



పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఆర్ఓ విష్ణుచరణ్

సాలూరు: నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కొనసాగుతోంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యా లెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో మంగళవారం 209 మంది ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1444 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు 1316 మంది ఓటు హక్కును వినియోగించుకున్నా రు. 91 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్న మెటీరియల్‌ను తనిఖీ చేశారు.

హోంఓటింగ్‌లో 60 ఓట్లు పోలింగ్

బలిజిపేట: హోం ఓటింగ్‌లో 60 ఓట్లు పోల్ అయినట్లు మండల నోడల్ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఓటుహక్కు కలిగి 85ఏళ్లు పైబడిన వృద్ధులు, 80శాతం పైగా దివ్యాంగత్వం కలిగిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారంతా ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మండలంలో 61మంది హోం ఓటింగ్‌కు అర్హులుగా గుర్తించారు. వారిలో 60 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఒకరు అందుబాటులో లేకపోవడంతో ఓటింగ్‌కు దూరమయ్యారని అధికారులు తెలిపారు.

జనసంద్రమైన వీరఘట్టం





జనసంద్రమైన వీరఘట్టం పట్టణం (ఇన్‌సెట్లో) వీరఘట్టం రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- వైఎస్సార్‌సీపీ రోడ్డు షోకు జననీరాజనం
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన పట్టణం
- విశ్వసనీయతకు మారుపేరైన కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందించేందు ప్రజలు 'సిద్ధం'
- రోడ్ షోలో జయకృష్ణపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిపై మూడోసారి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి జయకృష్ణకు రాజకీయ విజ్ఞత లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతితో కలిసి వీరఘట్టంలో మంగళవారం రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగవీధి జంక్షన్ వద్ద ఎమ్మెల్సీ విక్రాంత్ కొద్ది సేపు ప్రజలతో మాట్లాడారు. సిద్ధాంతాలు లేని గాజుగ్లాస్ పార్టీ అభ్యర్థికి ఓటమి తప్పదని హెచ్చరించారు. నమ్ముకున్న పార్టీ టీడీపీకి వెన్నుపోటు పొడిచి, సీటు కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి షర్టు మార్చుకున్న సేపులో పార్టీ మార్చి జనసేనలో చేరిన ఇటువంటి వ్యక్తులను రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

జయకృష్ణ చేసిన అక్రమాలే అతన్ని ఓడిస్తాయి

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిపై ఓడిపోయిన జయకృష్ణ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు అండతో ఈ ప్రాంతంలో చేసిన అరాచకాలను ఈ ప్రాంత ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రభుత్వ అండతో సీతంపేట ఐటీడీఏ అభివృద్ధి పనుల్లో, నీరు–చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు ప్రజాధానాన్ని దోచుకున్నారని, నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పి సొంతపార్టీ కార్యకర్తల నుంచే ముడుపులు తీసుకున్న నీచమైన చరిత్ర జయకృష్ణదని ఎద్దేవా చేశారు. జయకృష్ణ చేసిన అక్రమాలు, అరాచకాలు చూసిన పాలకొండ ప్రజలు 2019లో అతన్ని ఓడించారని, ఇప్పుడు టీడీపీ నుంచి జనసేనలోకి వెళ్లినంత మాత్రాన గతంలో జయకృష్ణ చేసిన అక్రమాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో జయకృష్ణకు హ్యాట్రిక్ ఓటమి.. కళావతికి హ్యాట్రిక్ విజయం అందించేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కళావతిని, ఎంపీగా గుమ్మ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

వీరఘట్టంను ప్రగతి పథంలోకి తీసుకొచ్చాం..

వీరఘట్టం పట్టణాన్ని ప్రగతి పథంలోకి తీసుకొచ్చామని మేమంతా గర్వంగా చెబుతున్నామని ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి అన్నారు. రూ.5.50 కోట్లతో వీరఘట్టం ప్రధాన రహదారిని అభివృద్ధి చేశామన్నారు. అందుకే మీ ముందుకు వచ్చి ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామన్నారు. వీరఘట్టం ప్రజలకు మేము చేసిన అభివృద్ధి, సంక్షేమమే మా విజయానికి దోహదపడతాయన్నారు.

కార్యకర్తల్లో నూతనోత్సాహం..

ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి రోడ్డుషోకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణంలోని ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. జై జగన్ నినాదాలతో వీరఘట్టం హోరెత్తింది. రోడ్ షో విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ పులిటి గౌరమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ చిన్న,బొమ్మాళి హేమలత,పిన్నింటి శ్రీను, శంబాన శ్రీను, జలుమూరు అమర్‌నాథ్, చుక్కా శ్రీను, సైల సుహాష్, పిన్నింటి దుర్గారావు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, బౌరోతు రాజశేఖర్, వావిలపల్లి పురుషోత్తమరావు, మెరుగుల చంద్రమౌళి, నీలం సత్యంనాయుడు, జంపు శేఖర్, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్నివర్గాలకు మేలు



గుమ్మలక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు అని వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఎల్విన్‌పేట, లక్కగూడ, మొరమ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమెకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. మండల కేంద్రంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గరలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె కాసేపు ప్రసంగించారు. అందరూ బాగుండాలన్నదే జగనన్న తపన అని, ఆ దిశగా తన ఐదేళ్ల పాలనను కొనసాగించారన్నారు. ఎన్నడూ లేని విధంగా అందరికీ లబ్ధి జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకురావడంతో పాటు గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌దారుల వద్దకే పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే కురుపాం నియోజకవర్గంలో కూడా ఎన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. రాష్ట్రానికి మంజూరైన ఒకేఒక్క గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను కురుపాంలో ఏర్పాటు చేయడం, ఎన్నో గిరిశిఖర గ్రామాలకు రూ.300 కోట్లతో పక్కా రోడ్లు, 68 వేల ఎకరాలకు సంబంధించి, ఆర్‌ఓఎఫ్‌ఆర్, డీకేటీ పట్టాలు గిరిజనులకు ఇవ్వడం, ఒకేఒక్క వైద్యాధికారికే పరిమితమైన భద్రగిరి ఆస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టడం, రూ.9 కోట్ల వ్యయంతో కార్పొరేట్ స్థాయిలో కొత్త ఆస్పత్రి నిర్మాణం, నాడు–నేడు కార్యక్రమం ద్వారా 300 పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు మించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడం, మరో రూ.1700 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు అందించడం వంటి ఎన్నో మంచి పనులు సీఎం జగనన్న చేశారన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు. తనను ఎలాగైనా ఓడించాలన్న దురుద్దేశంతో టీడీపీ నాయకులు తన ఆస్తి రూ.500 కోట్లు అని దుష్ప్రచారం చేస్తున్నారని, రుజువు చేస్తే పార్టీకి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయమాటలు విని, మోసపోవద్దన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, సర్పంచ్‌లు బి.గౌరీశంకరరావు, చైతన్య స్రవంతి, బి.సూర్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మొరమ గ్రామంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: కొండచిలకాంలో ఈవీఎంలో ఓటు వేయడాన్ని నేర్పిస్తున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. మంగళవారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది.

–సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: పట్టణంలోని 11వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: బిల్లుమడలో ఇంటింట ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గరుగుబిల్లి: ఉద్దవోలులో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ ఉరిటి రామారావు తదితరులు



పాలకొండ రూరల్: అంపిలిలో ఇంటింట ప్రచారంలో వైస్ ఎంపీపీ కె.సూర్యప్రకాష్, తదితరులు



పాలకొండ రూరల్: అన్నవరంలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ-2 అనిల్‌కుమార్, తదితరులు



సీతంపేట: జమ్మడుగూడలో ఇంటింట ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తిలిలో ప్రగతి పరుగులు

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమం
- వెర్రిగెడ్డపై కార్యరూపం దాల్చిన కాజ్‌వే నిర్మాణం
- ఐదేళ్లలోనే ఇదంతా సాధ్యమైందని అంటున్న గ్రామస్తులు

భామిని: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి, సంక్షేమం ఒకదానితో ఒకటి పోటాపోటీగా పరుగు తీస్తున్నాయి. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పంచాయతీ బత్తిలిలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే పంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో కోట్లాది రూపాయల సంక్షేమ లబ్ధిని చేకూర్చారు. జగనన్న ఐదేళ్ల పాలనలో పంచాయతీ రూపురేఖలు మారిపోయాయని ప్రజలు ఆనందంగా చెపుతున్నారు.

- పంచాయతీ పరిధిలో ఉన్న వెర్రిగెడ్డపై రూ.36 లక్షల వ్యయంతో కాజ్‌వే నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.
- రూ.4.25 కోట్లు వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో అవిభక్త జిల్లాలో రెండవ ఆదర్శ పోలీస్ స్టేషన్‌ను బత్తిలిలో నిర్మించారు.
- నాడు–నేడు నిధులు రూ.60 లక్షలతో పీహెచ్‌సీలో అధునాతన వసతులు కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించారు.
- నాడు–నేడు నిధులు రూ.89 లక్షలతో బత్తిలి ఉన్నత పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు.
- రూ.68 లక్షలతో రెండు గ్రామ సచివాలయ భవనాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఒక భవనం అందుబాటులోకి రాగా, రెండో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- రూ.1.5 లక్షలతో పంచాయతీ పరిధిలో 12 మినీ రక్షిత పథకాలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు.
- అన్ని వీధులను అనుసంధానం చేస్తూ రూ.15 లక్షల వ్యయంతో సీసీరోడ్లు నిర్మాణం చేపట్టారు.
- గ్రామంలో ఇళ్లు లేని 36 మంది నిరుపేదలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం చేశారు.
- గ్రామంలో టీటీడీ నిధులు రూ.10 లక్షలతో శివాలయ నిర్మాణం చేపడుతున్నారు.



సరిహద్దులో తలమానికంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనం

జగనన్న ప్రభుత్వంలోనే సంపూర్ణ అభివృద్ధి

సరిహద్దులో నిర్లక్ష్యానికి గురైన బత్తిలి మేజర్ పంచాయతీలో నేడు అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. ఎస్‌బీఐ, ఏపీజీవీబీ బ్రాంచ్‌లను కూడా ఏర్పాటు చేశారు. జగనన్న ఐదేళ్ల పాలనలోనే ఇదంతా సాధ్యమైంది.

– టింగ అన్నాజీరావు, ఎంపీటీసీ సభ్యుడు, బత్తిలి, భామిని మండలం



అధునాతన సౌకర్యాలతో పీహెచ్‌సీ భవనం

వైఎస్సార్‌సీపీలో చేరిక

భామిని: మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మండల భుజంగరావు, బీజేపీ నాయకుడు మండల రామారావు ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పతివాడ పగడాలమ్మ, మండల తిరుపతిరావు, ఉప సర్పంచ్ దామోదర అప్పన్న, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండల రామారావుకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళావతి